# 30

# లోకాన్ని నమ్ముకుంటే శ్రమ

## (యెషయా 31)

ఇక్కడ 31వ అధ్యాయం 30వ అధ్యాయాన్ని సంక్షిప్తంగా వివరించినట్లున్నది. విశ్వాసం లేనివారికి శ్రమ అంటూ ప్రారంభించబడి, విశ్వాస నమ్మకాలకు, పశ్చాత్తాపానికి ఆహ్వానం పలకడం యిక్కడ గమనించగలం.

### "ప్రభువును అన్వేషించనివారికి శ్రమ" (31:1–3)

ఇశ్రాయేలు పరిశుద్ధదేవుని లక్ష్యపెట్టకయు యెహోవాయొద్ద విచారింపకయు
సహాయము నిమిత్తము ఐగుప్తునకు వెళ్లుచు గుఱ్ఱములను ఆధారము చేసికొని
వారి రథములు విస్తారములనియు రౌతులు బలాఢ్యులనియు
వారిని ఆశ్రయించువారికి శ్రమ.
అయినను ఆయనయు బుద్ధిమంతుడుగా ఉన్నాడు.
మాట తప్పక దుష్టుల యింటివారిమీదను
కీడుచేయువారికి తోడ్పడువారిమీదను ఆయన లేచును.
ఐగుప్తీయులు మనుష్యులేగాని దేవుడు కారు
ఐగుప్తీయుల గుఱ్ఱములు మాంసమయములేగాని ఆత్మ కావు
యెహోవా తన చెయ్యిచాపగా సహాయము చేయువాడు జోగును
సహాయము పొందువాడు పడును వారందరు కూడి నాశనమగుదురు.

1వ వచనం గురించి J. Alec Motyer గారు చేస్తున్న వ్యాఖ్యానం గొప్ప సూచనలకు తార్కాణంగా నిలుస్తుంది: "*వెళ్ళుచు* అనే పదం వర్తమానాన్ని, ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను సూచిస్తుంది; *ఆధారము చేసుకునుట*, అనేది స్వభావ లక్షణాన్ని నడవడిని తెల్పుచున్నది; మరియు *సహాయము* నిమిత్తం *ఆధారముచేసుకొని* మరియు *ఆశ్రయించు* అనే పదాలు వారిలో స్థిరపడిన వైఖరిని అని సూచిస్తున్నాయి. అందుచేత ఈ కార్యములు వారి నిర్ణయాన్ని నిశ్చయాన్ని బహిరంగపర్చుచున్నవి."[1] రాజు యొక్క సలహాదార్లు, ఐగుప్తు సహాయాన్ని నమ్ముకొని దానిపై ఆధారపడియున్నారు, కాని ప్రభువు యొక్క సహాయాన్ని మాత్రం కోరుకోవడం లేదు. అది వారిని గొప్ప విపత్కర పరిస్థితులకు ఈడ్చుచున్నది.

ఇశ్రాయేలు యొక్క అనిశ్చల నమ్మిక "గొప్ప విపత్తుకు" దారితీస్తుంది (2ఎ వచనం; చూడు 30:1–3). దేవుని శిక్ష నిశ్చయం ఆయన "మాట తప్పక దుష్టుల యింటివారిమీదను కీడుచేయువారికి తోడ్పడువారిమీదను ఆయన లేచును" (2బి వచనం).

దేవుని నమ్ముకొని పొందే సహాయానికి పోల్చి చూచుకున్నట్లయితే ఐగుప్తీయులను నమ్ముకోవడం ఒట్టి అవివేకం (3 వచనం). వారు కేవలం నరులు వారి యుద్ధ రౌతులు కేవలం శరీరులు. దేవుడు సర్వజనుల సార్వభౌమ నాయకుడు. యూదా నాయకులు తీసుకున్న నిర్ణయం దేశాన్ని భ్రష్టు పట్టించి నాశనం చేస్తుంది.

## "ప్రభువు నిన్ను కాపాడును" (31:4, 5)

యెహోవా నాకీలాగు సెలవిచ్చియున్నాడు
–తప్పించుటకై గొఱ్ఱెల కాపరుల సమూహము కూడిరాగా
సింహము కొదమ సింహము
వారి శబ్దమునకు భయపడకయు వారి కేకలకు అధైర్యపడకయు
తనకు దొరికినదానిమీద గర్జించునట్లు
సైన్యములకధిపతియగు యెహోవా
యుద్ధము చేయుటకై సీయోను పర్వతముమీదికిని దాని కొండమీదికిని దిగి వచ్చును.
పక్షులు ఎగురుచు తమ పిల్లలను కాపాడునట్లు
సైన్యములకధిపతియగు యెహోవా యెరూషలేమును కాపాడును
దాని కాపాడుచు విడిపించుచునుండును
దానికి హానిచేయక తప్పించుచునుండును.

యెరూషలేమును మరియు సీయోను కొండయు విపత్తు నుండి కాపాడబడవలెనంటే ఒకే ఒక షరతు ఏమంటే ప్రజలు ఆయనను నమ్ముకొని పూర్తిగా ఆధారపడాలి. యెషయా యిక్కడ రెండు దృష్టాంతర రూపకాలను వాడుచున్నాడు, "సింహము కొదమ సింహము" (4 వచనం) మరియు "ఎగురుచుండు పక్షులు" (5 వచనం), ప్రభువు తన ప్రజలను ఎలా కాపాడుచున్నాడో యీ మాటలతో అతడు వివరిస్తున్నాడు. గొల్లలు, కాపలాదార్లు ఎంత ఎదుర్కొంటున్నప్పటికి సింహము మాత్రము తన ఎరను వదలిపెట్టని రీతిగా, పక్షి తన గూటిపై ఎగురుచూ దాని గుడ్లు కాపాడుకొను రీతిగా, సైన్యములకధిపతియగు యెహోవా యెరూషలేమును అష్షూరు బారినుండి కాపాడును.

## "ప్రభువు వైపు తిరుగుట!" (31:6–9)

ఇశ్రాయేలీయులారా,
మీరు ఎవనిమీద విశేషముగా తిరుగుబాటు చేసితిరో ఆయనవైపు తిరుగుడి.
మీకు మీరు పాపము కలుగజేసికొని
మీ చేతులతో మీరు నిర్మించిన వెండి విగ్రహములను సువర్ణ విగ్రహములను
ఆ దినమున మీలో ప్రతివాడును పారవేయును.
నరునిది కాని ఖడ్గమువలన అష్షూరీయులు కూలుదురు
మనుష్యునిది కాని కత్తిపాలగుదురు,
ఖడ్గ మెదుటనుండి వారు పారిపోవుదురు
వారి పడుచువారు దాసులగుదురు
భీతిచేత వారి ఆశ్రయదుర్గము సమసిపోవును
వారి అధిపతులు ధ్వజమును చూచి భీతినొంది వెనుక దీయుదురని యెహోవా సెలవిచ్చుచున్నాడు.
సీయోనులో ఆయన అగ్నియు యెరూషలేములో ఆయన కొలిమియు ఉన్నవి.

"ఆయనవైపు తిరుగుడి" (6 వచనం) అనునది తిరుగుబాటు జనులు పశ్చాత్తాపడడానికొక పిలుపు. "ఎంతగానో రోగపీడితులవడం" (*sarah*) అనునది "ఇశ్రాయేలు ప్రజలు దేవునికి ఎలా తిరుగుబాటు చేసినారో వివరిస్తుంది"[2] (చూడు యెషయా 1:23; యిర్మీయా 6:28).

"ఆ దినమున" (7 వచనం), ఆ రోజున దేవుడు ఇశ్రాయేలు పక్షంగా కార్యనిర్వాహణ చేస్తున్నాడు, విగ్రహారాధన అంతరించిపోతుంది. విగ్రహాలన్ని "విసిరిపారవేయబడతాయి" అవి పూర్తిగా పనికి రాని పనిముట్లవలె పారవేయబడతాయి.

మనుషుల చొరవ వలన కాదుగాని ప్రత్యక్షంగా దేవుడే జోక్యం చేసుకొని అష్షూరు యొక్క పతనానికి పరమ గీతం పాడినాడు. 8వ వచనంలోని వివరణ ఆధారం చేసుకొని పండితులు ఏమంటున్నారంటే అది క్రీ.పూ. 701లో సన్హెరీబు దండయాత్ర గురించి చెబుతుందంటారు, ఎందుకనగా అతని వ్యక్తులు ప్రభువు ద్వారా వధించబడినవారు.[3] అష్షూరు యొక్క "ఆశ్రయదుర్గము" భీతి చేత సమసిపోతుంది (9 వచనం) అంటున్నాడు దేవుడు. అష్షూరు వారు ఆశ్రయించిన "ఆశ్రయ దుర్గంలో" అన్నీవున్నాయి: రాజు, శక్తివంతమైన సైన్యం, విగ్రహాలు మరియు, ధనసంపదలు. ఇక్కడ "అగ్ని" మరియు "కొలిమి" అనేవి దేవుడు తీర్పు తీర్చుటకు దిగివస్తున్నాడనడానికి సూచనగాయున్నది. ఇంతకముందే అష్షూరు యొక్క నాశనం గురించి యెషయా ప్రకటించాడు.[4]

---

సూచనలు

[1]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 254. [2]R. Laird Harris, Gleason L. Archer, Jr., and Bruce K. Waltke, eds., *Theological Workbook of the Old Testament* (Chicago: Moody Press, 1980), 2:635. [3]Neale Pryor, Class Lectures, The Major Prophets, Harding University, Searcy, Ark., Spring, 2003. [4]యెషయా 10:12-19, 24-27; 14:24-27; 29:6; 30:27-33.

---

## వాక్యభాగాన్ని బోధించుట

ఎడ్డీ క్లోయర్

---

### ❖❖❖ రథములను ఆశ్రయించుట ❖❖❖
### (31 అధ్యాయం)

అష్షూరును ఓడించడానికై ఐగుప్తును ఆశ్రయించినందుకు యూదాను దేవుడు గద్దిస్తున్నాడు (1వ వచనం). ఐగుప్తుపై ఆధారపడేకంటే ప్రభువు మీద ఆధారపడి యుండవలసినది. దేవుడు చేయగల్గిన దాన్ని మనుష్యులు తమకు చేయాలంటూ మనుష్యులపై ఆధారపడే దేవుని ప్రజలకు ఆ రోజు మహా విచారకరమైన రోజు.

దేవుడు తాను చేస్తానని వాగ్దానం చేసినదాన్ని మనం మనిషిమీద ఆధారపడి అడిగి పొందడానికి ప్రయత్నించిన పాపం మనం కూడ చేయలేదా? ఇలాంటి కార్యాన్ని మనం ఎలా వివరించగలం?

*ఇది సరైన విశ్వాసం లేకపోవడం వల్ల.* కాపాడి నడిపించి సమకూరుస్తాన్న దేవుడు తన ప్రజలకు యిచ్చిన వాగ్దానాన్ని పెడచెవిని బెట్టి, యూదా ఐగుప్తు వైపుకు తిరుగుట. మొదట్లో యూదా దేవునితో చేసుకున్న నిబంధన ఏమిటి? తన ప్రజలు దేవుని సేవిస్తామని, ఆయనే వారి నాయకుడై ఉండి సమస్తాన్ని అనుగ్రహించువానిగా ఉంటాడని. కాని యూదా దేవునితో చేసుకున్న ఒడంబడికలో కొంత విశ్వాస కొరత కనిపిస్తుంది.

డబ్బు ద్వారా, భౌతిక సంబంధమైన శక్తి సామర్థ్యాల ద్వారా పరిస్థితులను అదుపుచేసుకోడానికి మనం ప్రయత్నిస్తుంటే మనం కూడ అదే పొరపాటు చేయడం లేదంటారా? మొదట ఆయన నీతిని రాజ్యాన్ని వెదకినట్లయితే మన జీవితావసరములను అనుగ్రహిస్తానని యేసు వాగ్దానం చేయలేదా?

*ఇది దురుద్దేశంతో కూడి కార్యాము.* పనికిమాలిన, నిస్సహాయులైన మనుష్యుల సహాయాన్ని యూదా కోరుకుంటూ వారివైపు తిరుగుతుంది. గొప్పదానికి బదులుగా పనికిమాలిన దాన్ని మార్చుకుంటుంది. దేవుని శక్తి పై ఆధారపడి సాధించుకునే గొప్పదాన్ని మానవ బలహీనతను అడ్డం పెట్టుకొని పొందాలనుకుంటుంది. ఐగుప్తు దేవునికంటె గొప్ప శక్తిగలదని ఎవరైనా ఊహించగలరా? మరి మన సంగతేమిటి? డబ్బు, శక్తి, పేరు ప్రతిష్ఠలు దేవునికంటె ఎంతో శక్తివంతమైనవని మనం నమ్మగలమా?

*అది, అనవసరమైన కార్యం.* మనకు పరలోకపు తండ్రియున్నాడు. ఆయన తన పిల్లలనెంతో శ్రద్ధతో కనిపెట్టుకొనియుంటాడు. ఆయన చిత్తాన్ని మనం జరిగించాలని కోరుకొంటున్నప్పుడు మనలను నడిపించి ఆదుకొనడానికి ఏ విధంగా వెనుకాడడు. మనమెప్పటికి అనాథలము కాము మనమెప్పుడు మనకు సహాయాన్ని, అక్కరలను దేవునినుండే కోరుకోవచ్చు. దేవుని బిడ్డలముగా సమస్తం మనకు యివ్వబడింది సుమా!

*అది ఎప్పటికీ నిందారహిత కార్యం.* మనుష్యుల శక్తి మీద ఆధారపడేవాడెన్నటికి విజయం పొందలేడు. మనం మన తప్పులనుండి పాఠాలు నేర్చుకుంటాము, దాంట్లో సంతోషమంటూ లేనే లేదు. మన అవివేకాన్ని గూర్చి మనలో మనం యిలా వాపోతుంటాం, “అలా ఎందుకు చేశాను? నేనేమని ఆలోచించాను?” ఈ విధంగా మనం చేతులారా చేసుకున్న గాయాలనుండి, అపాయాలనుండి అతిత్వరగా విజయపంథాలో అడుగుపెట్టాలని కోరుకుంటాం.

ఔను, ఐగుప్తు వైపు తిరగడం ఒక అవిశ్వాస కార్యం అవివేకమైంది. అనవసరమైంది. మనం కోరుకున్నదానికంటె యింకా ఎక్కువగా మనకివ్వడానికి దేవుడు సిద్ధంగా ఉన్నాడు. మనం ఏమి చేయాలని ఆయన కోరుకుంటుంటాడో అది చేయడానికి మనకు నిరంతరం సహాయం చేస్తుంటాడు. అలాంటప్పుడు మనం ఆయనయందు నమ్మకముంచలేమా? మనం ఆయనయందు పూర్తిగా మన నమ్మకాన్ని నిల్పుదాం. ఆయన మాత్రమే మనలో చేయగల్గిందెల్లా ఆయన చేయనిద్దాం.